TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

**విలేఖరులు కావలెను**

అసలైన అక్షర జ్ఞానాన్ని వెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా...? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను...

సంపుటి : 1 సంచిక :121 prajadivvs57@gmail. com శనివారం 14, మార్చి 2026 ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ పేజీలు : 4 వెల : 3/-

# మూసీ పునరుజ్జీవం మన బాధ్యత

## అభివృద్ధిని అడ్డుకోవద్దు.. సలహాలు ఇవ్వండి

**ప్రతిపక్షాలకు రేవంత్ రెడ్డి సీఎం సూచన**

**గోదావరి జలాలతో మూసీకి కళ.. రూ. 75 కోట్లతో బాపూఘాట్ వద్ద గాంధీ విగ్రహం**

ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం ఇచ్చారన్నారు. వారికి తాము కాపాలదారులుగా ఉంటామని స్పష్టం చేశారు. సింగపూర్, దుబాయ్, లండన్, సియోల్ నగరాలలో తాను పర్యటించానని చెప్పారు. మనకు ఏం అవసరమో అక్కడ స్టడీ చేసి వచ్చామన్నారు. మేం తెచ్చే ప్రాజెక్ట్ ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. బుల్‌డోజర్లతో కూల్చేస్తున్నారని అంటున్నారని చెప్పారు. అవి చదువుకున్నవాళ్లు మాట్లాడే మాటలా అని ప్రతిపక్షాలను ఆయన సూటిగా ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్టును అడ్డుకునే వాళ్లు మూడు నెలలు అక్కడ నివసిస్తారా? అంటూ ప్రతిపక్ష పార్టీలకు చెందిన అగ్రనేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు.



మూసీ ప్రాజెక్టుపై ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం హైదరాబాద్‌లో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై నిర్వహించిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వానికి రాజకీయ భేదాలు ఉండొచ్చు కానీ, అభివృద్ధి విషయంలో 'పొలిటికల్ పెరాలసిస్' లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థను ప్రపంచస్థాయికి తీసుకెళ్లేందుకే ఈ

మిగతా 2 లో




# ఇరాన్ వ్యూహాత్మక అడుగులు

**అమెరికాపై పట్టుకు వేగంగా కదులుతున్న పావులు**

**గల్ఫ్ దేశాలకు ప్రాణసంకటంగా ఇరాన్ దాడులు**



## ఒమన్‌లో డ్రోన్ దాడి

**ఇద్దరు భారతీయుల మృతి**

ఒమన్‌లోని సోహార్ నగరంలో జరిగిన డ్రోన్ దాడిలో ఇద్దరు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. మరో 11 మందికి గాయాలు కాగా.. వీరిలో 10 మంది భారతీయులేనని సమాచారం. ఐదుగురు ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నారని భారత విదేశాంగ వెల్లడించింది.




2

## ఆర్టీసీలో సమ్మె సైరన్

**డిమాండ్లతో కూడిన నోటీస్ ఇచ్చిన జేఏసీ**

తెలంగాణ ఆర్టీసీలో మరోసారి సమ్మె సైరన్ మోగింది. టీజీఎస్ ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు.




02

మావోయిస్ట్ అగ్రనేత

## సంస్మరణ సభ

**హాజరైన 230 మందికి ఎన్ఐఏ నోటీసులు**

# చర్లపల్లికి మరో 'అమృత్ భారత్'

4



- అస్సాంలో ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభించిన ప్రధాని మోదీ
- తెలుగు రాష్ట్రాల రైల్వే ప్రయాణికులకు శుభవార్త

# ఇంధన, గ్యాస్ కొరతపై సర్కారు అలర్ట్

**అత్యవసర సేవలకు ఆటంకం లేకుండా చర్యలు**

**కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు**



**దేశవ్యాప్తంగా నెలకొన్న ఇంధన, గ్యాస్ సరఫరా పరిస్థితులపై తెలంగాణ ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో అత్యవసర సేవలకు ఎటువంటి ఆటంకం కలగకుండా గ్యాస్ సరఫరాను క్రమబద్ధీకరిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.**

ప్ర: శుక్రవారం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్యాస్ సరఫరా అనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని, మార్కెట్‌లో నెలకొన్న స్వల్ప కొరతను దృష్టిలో ఉంచుకుని కేంద్రం జారీ చేసిన మార్గదర్శకాలను రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. గ్యాస్ ఉత్పత్తిని పెంచామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన నేపథ్యంలో, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో సమన్వయం కోసం ప్రభుత్వం

మిగతా 2 లో

# మూసీ నది శుద్ధికి అభ్యంతరం లేదు

**ఇళ్ల కూల్చివేతనే మా అభ్యంతరం!**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్**



మూసీ నది పునరుజ్జీవనాన్ని బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకించలేదని, అయితే అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని మాత్రం తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ నేతలు బీజేపీపై చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టారు. 'గాంధీ సరోవర్' పేరుతో నివాసాలను ధ్వంసం చేయడం అంగీకారయోగ్యం కాదని పేర్కొన్నారు.



## ముస్లింల సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్

**గజ్వేల్ ఇఫ్తార్ విందులో హరీష్ రావు విమర్శలు**

3

కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింల సంక్షేమం కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. గజ్వేల్ అభివృద్ధి కోసం ఇచ్చిన నిధులు తిరిగి వెనక్కి తీసుకుంది. కొత్త నిధులు ఇవ్వాల్సింది పోయి, ఉన్న నిధులు లాక్కోవడం దారుణం.

# హైదరాబాద్ వాసులకు మరో అర్బన్ పార్క్

**గుర్రంగూడ అటవీ భూములను రిజర్వ్ ఫారెస్ట్‌గా గుర్తింపు ఉత్తర్వుల జారీచేసిన తెలంగాణ ప్రభుత్వం**



నగరవాసులకు ప్రభుత్వం ఓ తీపి కబురు అందించింది. నగర శివార్లలో మరో భారీ పచ్చని ప్రదేశం 'అర్బన్ ఫారెస్ట్ పార్క్' రూపంలో అందుబాటులోకి రానుంది. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న న్యాయ పోరాటానికి తెరదించుతూ, ఆమన్‌గల్ డివిజన్ పరిధిలోని గుర్రంగూడ అటవీ భూములను 'రిజర్వ్ ఫారెస్ట్'గా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

2

# భారతి బిల్డర్స్‌కు 4.74 కోట్ల భారీ జరిమానా

## తెలంగాణ రెరా కొరడా

**ప్రీ-లాంచ్ పేరుతో అక్రమ వసూళ్లు..**

**ప్రాజెక్టు పూర్తి చేయడంలో విఫలం**

**కొనుగోలుదారులకు 60 రోజుల్లోగా వడ్డీతో సహా నగదు వాపసు చేయాలని ఆదేశం**




02



# ఆర్టీసీలో సమ్మె సైరన్

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ ఆర్టీసీలో మరోసారి సమ్మె సైరన్ మోగింది. టీజీఎస్ ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు. శుక్రవారం నాడు బస్ భవన్‌లో ఆర్టీసీ ఉన్నతాధికారులకు జేఏసీ నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు. అనంతరం లేబర్ కమిషనర్ కార్యాలయంలో సమ్మె నోటీసు ఇచ్చారు. ఆర్టీసీ సమ్మె తేదీపై 14 రోజుల తరువాత నిర్ణయం తీసుకుంటామని.. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్లడం ఖాయమని జేఏసీ నేతలు తేల్చి చెప్పారు.తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే పక్రియను వెంటనే చేపట్టాలన్నారు. 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలి. మహాలక్ష్మి పథకం కింద ప్రతినెలా రూ.350 కోట్లు కోత లేకుండా ఇవ్వాలి.పాత బకాయిలు రూ.2,500 కోట్లు వెంటనే విడుదల చేయాలి.ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలి. అన్ని కేటగిరీల్లో పనిచేసే ఉద్యోగులపై అధిక పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు.

# హైదరాబాద్‌వాసులకు మరో అర్బన్ పార్క్

## గుర్రంగూడ అటవీ భూములను రిజర్వ్ ఫారెస్ట్‌గా గుర్తింపు

## ఉత్తర్వుల జారీచేసిన తెలంగాణ ప్రభుత్వం

నగరవాసులకు ప్రభుత్వం ఓ తీపి కబురు అందించింది. నగర శివార్లలో మరో భారీ పచ్చని ప్రదేశం 'అర్బన్ ఫారెస్ట్ పార్క్' రూపంలో అందుబాటులోకి రానుంది. ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న న్యాయ పోరాటానికి తెరదించుతూ, ఆమన్‌గల్ డివిజన్ పరిధిలోని గుర్రంగూడ అటవీ భూములను 'రిజర్వ్ ఫారెస్ట్'గా మారుస్తూ తెలంగాణ ప్రభుత్వం శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం నగర పర్యావరణానికి పెద్ద పీట వేయనుంది. సుమారు 424 ఎకరాల 31 గుంటల భారీ విస్తీర్ణంలో ఈ అటవీ భూభాగం విస్తరించి ఉంది. తెలంగాణ ఫారెస్ట్ చట్టం-1967లోని సెక్షన్ 15 ప్రకారం.. పర్యావరణ, అటవీ శాఖ ఈ హోదాను కల్పించింది. ఈ భూముల్లోని సాహెబ్‌నగర్ కలాన్ గ్రామానికి చెందిన 102 ఎకరాలపై సుదీర్ఘ కాలంగా కోర్టులో వివాదం నడిచింది. దీనిని 'సాహెబ్‌నగర్ కలాన్ కేసు'గా పిలుస్తారు. చివరకు సుప్రీంకోర్టు అటవీ శాఖ వాదనను సమర్థిస్తూ తీర్పు ఇవ్వడంతో ఆక్రమణదారుల నుంచి ఈ భూమికి విముక్తి లభించింది. నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న తరుణంలో? ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించే 'గ్రీన్ లంగ్ స్పేస్'గా దీనిని తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. పర్యాటకుల కోసం ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడ కుటుంబాలతో కలిసి వారాంతాల్లో సమయాన్ని గడిపేలా విశ్రాంతి ప్రదేశాలు, చిన్నారుల కోసం ప్లే ఏరియాలు రానున్నాయి. అడవుల ప్రాముఖ్యతను వివరించేలా నాలెడ్జ్ సెంటర్లను ఇక్కడ నిర్మించే అవకాశం ఉంది. రిజర్వ్ ఫారెస్ట్ హోదా రావడం వల్ల ఇక్కడ ఉన్న స్థానిక వృక్ష సంపద, జీవవైవిధ్యానికి చట్టపరమైన రక్షణ లభిస్తుంది. ఇకపై ఇక్కడ ఎలాంటి అనధికారిక నిర్మాణాలు లేదా ఆక్రమణలకు తావు ఉండదు. హైదరాబాద్ చుట్టుపక్కల ఇప్పటికే ఉన్న గజ్వేల్, శామీర్‌పేట వంటి అర్బన్ పార్కుల తరహాలోనే.. గుర్రంగూడ పార్క్ కూడా బిఎన్ రెడ్డి నగర్, హస్తినాపురం, సాగర్ రోడ్ ప్రాంతాల వారికి ప్రధాన పర్యాటక కేంద్రంగా మారనుంది.

# అసెంబ్లీ ప్రశ్నలకు సమాధానాలు సిద్ధం చేయండి: సీఎస్

: ఈనెల 16 వ తేదీ నుండి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్నందున ఇప్పటి వరకు వచ్చిన ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలు వెంటనే సమర్పించాలని అన్ని విభాగాల ఉన్నతాధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ రావు ఆదేశించారు. సెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో పెండింగులో ఉన్న ప్రశ్నలకు రావాల్సిన సమాధానాలు, సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులతో సి.ఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, శాసన మండలి, శాసనసభ సమావేశాల నేపథ్యంలో గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్నలన్నింటికీ రేపటిలోగా సమాధానాలు పంపించాలని అన్నారు. ప్రధానంగా, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ పరిపాలన, ఇంధనశాఖ, రెవిన్యూ తదితర శాఖలకు సంబంధించి అధికంగా ప్రశ్నలున్నాయని, వీటన్నింటికీ వెంటనే సమాధానాలు పంపాలని అన్నారు. బ్జడెట్ సమావేశాలు గవర్నర్ ప్రసంగం తో ప్రారంభమవుతాయన్నారు. బ్జడెట్ సమావేశాల నిర్వహణపై ఉప ముఖ్యమంత్రి ఆదివారం నాడు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నార ని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల

## మార్చి 16న నోటిఫికేషన్

## 18 నుంచి మే 10వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు

: తెలంగాణలోని రాజీవ్ గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బాసర, మహబూబ్‌నగర్ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో 2026-27 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదలైంది. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాల షెడ్యూల్‌ను ఆర్జీయూకేటీ బాసర వీసీ గోవర్దన్ శుక్రవారం విడుదల చేశారు. దీని ప్రకారం.. మార్చి 16న నోటిఫికేషన్, మార్చి 18 నుంచి మే 10వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల పక్రియ కొనసాగనుంది. అర్హులైన అభ్యర్థులు టీజీఆన్‌లైన్ సెంటర్లు/మీసేవ/యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రొవిజినల్ జాబితాను మే 30న ప్రకటించి తొలి విడత కౌన్సెలింగ్‌ను జూన్ 5న నిర్వహించనున్నట్లు వీసీ తెలిపారు. ఈ షెడ్యూల్ విడుదల కార్యక్రమంలో ఓఎస్డీ ప్రొఫెసర్ ఈ. మురళీ దర్శన్, ప్రవేశాల కన్వీనర్ శీలం శేఖర్, కో-కన్వీనర్ బండి హరికృష్ణ, అసోసియేట్ డీన్‌లు డా.మహేష్, డా. విఠల్, డా.దేవరాజ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

# మూసీ పునరుజ్జీవం మనందరి బాధ్యత

మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టామని స్పష్టం చేశారు. ప్రపంచంలోని సింగపూర్, లండన్, సియోల్ వంటి నగరాలను అధ్యయనం చేసిన తర్వాతే ఈ ప్రణాళిక రూపొందించామని సీఎం వివరించారు. "నిజాం రాజులు వందేళ్ల క్రితం అందించిన జలాశయాలు నేటికీ మన దాహార్తిని తీరుస్తున్నాయి. అదే స్ఫూర్తితో భవిష్యత్ తరాల కోసం మూసీని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మనపై ఉంది" అని పేర్కొన్నారు. మూసీని వ్యతిరేకిస్తున్న బిఆర్ఎస్, బీజేపీ నేతలు అడ్డుపడటం మానేసి, ప్రాజెక్టును మరింత మెరుగ్గా ఎలా చేయాలో సలహాలు ఇవ్వాలని కోరారు. ఆ సలహాలను స్వీకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కేవలం రంగారెడ్డి జిల్లా ప్రయోజనాలే కాకుండా, కలుషిత నీటితో ఇబ్బంది పడుతున్న నల్గొండ జిల్లా రైతాంగం గురించి కూడా ఆలోచించాలని సీఎం కోరారు. గోదావరి జలాల్లో 20 టీఎంసీలను మూసీకి తరలించే పనులు ప్రారంభించామని, తద్వారా మూసీలో నిరంతరం 2.5 టీఎంసీల స్వచ్ఛమైన నీరు ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. బాపూఘాట్ వద్ద రెండు నదుల సంగమ ప్రాంతాన్ని కన్యాకుమారి తరహాలో తీర్చిదిద్దుతామని, అక్కడ రూ. 75 కోట్లతో బాపూ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బుల్‌డోజర్ల ప్రస్తావన తెస్తూ ప్రతిపక్షాలు పేదలను భయపెట్టడం మానుకోవాలని, అభివృద్ధి ఎవరికీ



వ్యతిరేకం కాదని సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# ఇంధన, గ్యాస్ కొరతపై ప్రభుత్వం అప్రమత్తం

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో సివిల్ సప్లై కమిషనర్, పోలీస్ అధికారులు మరియు ఇతర ఉన్నతాధికారులతో కూడిన కమిటీని నియమించారు. అదేవిధంగా ప్రతి జిల్లాలో కలెక్టర్, ఎస్పీ, వైద్య అధికారులు మరియు కంపెనీ ప్రతినిధులతో కూడిన కమిటీలు క్షేత్రస్థాయిలో సరఫరాను పర్యవేక్షిస్తాయని మంత్రి వివరించారు. హైదరాబాద్‌లోని సివిల్ సప్లై కార్యాలయంలో ప్రత్యేకంగా 'కమాండ్ కంట్రోల్ రూమ్'ను ఏర్పాటు చేసి, సరఫరాలో తలెత్తే అంతరాయాలను నివారించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. హోటళ్లు, రెస్టారెంట్ల యజమానుల విజ్ఞప్తి మేరకు తమను



కూడా అత్యవసర సేవల కింద గుర్తించాలన్న విన్నపాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని ఆయన హామీ ఇచ్చారు. ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాష్ట్రంలో ఇంధన, గ్యాస్ కొరత లేకుండా చూసే పూర్తి బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని భరోసా ఇచ్చారు.

# మావోయిస్టు అగ్రనేత సంస్మరణ సభ

## హాజరైన 230 మందికి ఎన్ఐఏ నోటీసులు

ఇటీవల మావోయిస్టు అగ్రనేత రామచంద్రారెడ్డి (వికల్ప్) అంత్యక్రియలు, సంస్మరణ సభకు హాజరైన మాజీ మావోయిస్టులపై జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ దృష్టి సారించింది. ఈ క్రమంలో సుమారు 230 మందికి నోటీసులు జారీ చేయడం ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో పెద్ద చర్చకు దారితీసింది. గతేడాది అక్టోబరు 18 న హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలోని కోహెడలో మావోయిస్టు అగ్రనేతలు రామచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణరెడ్డిల జ్ఞాపకార్థం 'నారాయణపూర్ అమరుల సంస్మరణ సభ' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున మాజీ మావోయిస్టులు, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. సభలో పాల్గొన్న వారిపై ఎన్ఐఏ ఆకస్మికంగా నోటీసులు జారీ చేసింది. ఈ సభలో పాల్గొన్న కొందరు నాయకులు ప్రభుత్వ వ్యతిరేక, వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ముఖ్యంగా గాదె ఇన్నయ్యలాంటి వారిపై ఇప్పటికే దేశద్రోహం కేసులు నమోదయ్యాయి. నిషేధిత సంస్థలతో సంబంధాలు లేదా ఆ సంస్థల భావజాలాన్ని ప్రచారం చేస్తున్నారా అనే కోణంలో లోతైన విచారణ చేపట్టడానికి ఈ నోటీసులు ఇచ్చారు. జస్టిస్ చంద్రకుమార్, సోనీ సోరి, పినాకపాణి వంటి ప్రముఖులు ఈ సభలో పాల్గొనడం కూడా దర్యాప్తు సంస్థల దృష్టిని ఆకర్షించింది. నోటీసులు అందుకున్నవారిలో మెజారిటీ వ్యక్తులు హుజూరాబాద్, సైదాపూర్, భీమదేవరపల్లి, ముల్కనూరు, కమలాపూర్, ధర్మసాగర్, పరకాల, టేకుమట్ల, వేలేరు ప్రాంతాలకు చెందినవారు ఉన్నారు. దశాబ్దాల క్రితమే జనజీవన స్రవంతిలో కలిసిపోయిన తమకు, ఇప్పుడు పాత సంబంధాల పేరుతో నోటీసులు రావడంపై మాజీ మావోయిస్టులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన




వ్యక్తం చేస్తున్నారు.

# దేశంలో గ్యాస్ కొరత లేదు

## ప్యానిక్ బుకింగ్స్ అవసరం లేదు.. కేంద్రప్రభుత్వం స్పష్టీకరణ



**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎల్‌పీజీ కొరత ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఎలాంటి భయాందోళనలు వద్దని, 'ప్యానిక్ బుకింగ్' అవసరం లేదని తెలిపింది. సంక్షోభం లేదని వివరించింది. గృహావసరాల కోసం ఎలాంటి అంతరాయం లేకుండా పైపుల ద్వారా సహజ వాయివు , కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ సరఫరాకు భరోసా ఇచ్చింది. పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ శుక్రవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ, ఆసుపత్రులు, హాస్టల్స్‌కు ఎల్‌పీజీ సరఫరాకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెప్పారు. మార్చి 2026తో పోల్చుకుంటే దేశంలో ఎల్‌పీజీ ఉత్పత్తి 40 శాతం పెరిగిందని, అదనంగా రాష్ట్రాలకు 48,000 కిలోలీటర్ల (సుమారు 48 మిలియన్ లీటర్లు) కిరోసిన్ పంపిణీ చేశామని తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లకు బొగ్గు సరఫరా చేయాలని కోల్ ఇండియాను ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. మధ్యప్రాచ్యంలో యుద్ధానికి ముందు యావరేజ్‌గా 55.7 లక్షల బుకింగ్‌లు ఉంటే మార్చి 12 నాటికి అది 75.7 లక్షలకు పెరిగిందని, భయాల కారణంగానే బుకింగ్‌లు అనూహ్యంగా పెరిగాయని సుజాతా శర్మ తెలిపారు. ఎల్పీజీపై ఒత్తిడి తగ్గేందుకు పీఎన్‌జీ కనెక్షన్లకు మళ్లాలని ప్రజలను కోరారు. క్రూడాయిల్‌కు సంబంధించి 258 మిలియన్ మెట్రిక్ టన్నుల ర్గి÷ల్గ÷నింగ్ కెపాసిటీ మనకు ఉందని, పెట్రోల్, డీజిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని కలిగి ఉన్నామని వివరించారు. ప్రధానమైన అర్బన్ సిటీలు, కేంద్రాల్లో కమర్షియల్ వినియోగదారుల ఆందోళన, సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కమర్షియల్ వినియోగదారులు స్థానిక సీజీడీ (సిటీ గ్యాస్ డిస్టిబ్యూషన్) నెట్‌వర్క్ ప్రొవైడర్‌ను కానీ, సంబంధిత డీలర్‌ను కానీ సంప్రదించి పీఎన్‌జీ కనెక్షన్ పొందవచ్చని సూచించారు. దేశంలోని అన్ని పెట్రోల్ పంపుల్లో తగినన్ని పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని, బంక్‌లు ఖాళీ అయినట్టు 25,000 డిస్టిబ్యూటర్లలో ఏ ఒక్కరి నుంచీ తమకు సమాచారం లేదని సుజాతా శర్మ తెలిపారు. వదంతులను విశ్వసించవద్దని, ప్యానిక్ బైయింగ్‌కు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# భారీ జీఎస్టీ కుంభకోణం బట్టబయలు

## రూ.84.15 కోట్ల మోసం

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ భారీ జీఎస్టీ కుంభకోణాన్ని బయట పెట్టింది. సుమారు రూ.84.15 కోట్ల విలువైన ఐటీసీ మోసం జరిగినట్లు గుర్తించింది. ప్రధాన నిందితుడు, ఎస్‌కేజీ ట్రేడింగ్ కంపెనీ ప్రొప్రైటర్ సందీప్‌ను అధికారులు అరెస్టు చేశారు. నిందితుడు నకిలీ ఇన్వాయిస్‌ల ద్వారా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందినట్లు గుర్తించారు. సందీప్‌కు సంబంధమున్న ఇతర సంస్థల్లోనూ అక్రమాలు జరిగినట్లు తేలింది. ఈక్రమంలో వాటి రిజిస్ట్రేషన్లను అధికారులు రద్దు చేశారు. సందీప్‌ను జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు.




# భారతి బిల్డర్స్‌కు 4.74 కోట్ల భారీ జరిమానా

## తెలంగాణ రెరా కొరడా

## ప్రీ-లాంచ్ పేరుతో అక్రమ వసూళ్లు..

## ప్రాజెక్టు పూర్తి చేయడంలో విఫలం

## కొనుగోలుదారులకు 60 రోజుల్లోగా వడ్డీతో సహా నగదు వాపసు చేయాలని ఆదేశం

: నిబంధనలకు విరుద్ధంగా 'ప్రీ-లాంచ్' స్కీమ్‌ల పేరుతో కొనుగోలుదారుల నుండి నిధులు వసూలు చేసి, నిర్మాణ పనులు చేపట్టని భారతి బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ భారీ జరిమానా విధించింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కొంపల్లిలోని 'భారతీ లేక్ వ్యూ అపార్ట్‌మెంట్స్' ప్రాజెక్టుకు సంబంధించి మొత్తం రూ. 4,74,17,729 కోట్ల జరిమానా విధిస్తూ అథారిటీ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో విధించిన జరిమానాకు అదనంగా తాజా ఉల్లంఘనల కింద ఈ మొత్తాన్ని నిర్ణయించింది. 2021లో ఎటువంటి చట్టబద్ధమైన అనుమతులు, రెరా రిజిస్ట్రేషన్ లేకుండానే 24 నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేస్తామంటూ బిల్డర్ కొనుగోలుదారుల నుండి నిధులు సేకరించారు. అయితే, ప్రాజెక్టులో ఎటువంటి పురోగతి లేకపోవడంతో బాధితులు రెరాను ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన అథారిటీ, భారతి బిల్డర్స్‌ను లిలి'డిఫాల్టర్ ప్రమోటర్'లిలిగా ప్రకటించింది. బాధితులు చెల్లించిన పూర్తి మొత్తాన్ని వడ్డీతో కలిపి 60 రోజుల్లోగా వాపసు చేయాలని స్పష్టం చేసింది. ఈ బాధ్యతను భారతి బిల్డర్స్ మరియు భాగస్వామ్య సంస్థలు ఉమ్మడిగా భరించాలని తీర్పునిచ్చింది. ఈ సందర్భంగా రెరా అథారిటీ రియల్ ఎస్టేట్ కొనుగోలుదారులకు కీలక హెచ్చరికలు జారీ చేసింది. రెరా రిజిస్ట్రేషన్ లేని ప్రాజెక్టుల్లో 'ప్రీ-లాంచ్' ఆఫర్లలో పెట్టుబడులు పెట్టడం చట్టరిత్యా నిషిద్ధమని పేర్కొంది. ఇటువంటి స్కీమ్‌ల వల్ల కొనుగోలుదారులు ఎస్క్రో ఖాతా భద్రతను, ప్లానింగ్ అథారిటీ వద్ద ఉండే మార్టిగేజ్ రక్షణలను కోల్పోతారని హెచ్చరించింది. ఏదైనా ప్రాజెక్టులో ఫ్లాట్ లేదా ప్లాట్ కొనే ముందు అధికారిక పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ వివరాలను తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలని అథారిటీ సూచించింది.



# బ్రతుకు దేరువు కోసం గల్ఫ్ వెళ్లిన కొడుకు శవ పేటికలో శవం గా వచ్చాడు




**ముస్తాబాద్ / మార్చి 13 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం సేవాలాల్ తండా గ్రామ పంచాయతీ ( బట్టోని తాళ్ల కు)చెందిన రాగం ప్రశాంత్ గత కొన్ని రోజుల క్రితం బ్రతుకుదేరువు కోసం గల్ఫ్ మస్కట్ కు వెళ్లగా గత రెండు రోజుల క్రితం మస్కట్లో రాగం ప్రశాంత్ గుండెపోటుతో మరణించినట్లు తెలపడంతో కన్నా తల్లిదండ్రులు బంధుమిత్రులు కన్నీటి శ్లోకంలో మునిగిపోయారు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారంతో రాగం ప్రశాంత్ శవ పేటిక నేడు స్వగ్రామం చేరుకుంది ప్రశాంత స్నేహితులు భారీ బైక్ ర్యాలీతో ఇంటి వరకు వెళ్లారు గ్రామంలో విషాద ఛాయలు కమ్ముకున్నాయి కన్న కొడుకు గల్ఫ్ దేశం వెళ్లి నాలుగు పైసలు సంపాదించుకొని ఇంటికి వస్తాడని అనుకున్న తల్లిదండ్రులు కొడుకు శవపేటికను చూడగానే కొడుకా ప్రశాంతు కన్న బిడ్డతోనైనా కడుపునిండా మాట్లాడు బిడ్డా లేవరా నీ బంధుమిత్రులు స్నేహితులు నీ మాట కోసం ఎదురుచూస్తున్నారు బిడ్డ ఒక్కసారైనా మాట్లాడవా అంటూ తల్లిదండ్రులు బిక్కుబిక్కున ఏడుస్తూ కానరాని లోకాలకు వెళ్లి పోయావా కొడకా చివరగా మాట్లాడకుండా శవముతో దర్శనమిచ్చావా కొడుకా అంటూ బోరున విలపిస్తున్నారు వారి ఆత్మకు శాంతి చేకూరాలని బంధుమిత్రులు స్నేహితులు కోరుతున్నారు శవం రావడానికి సహకరించిన హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

# భక్తుల పట్ల మర్యాదగా ఉండాలి: వేములవాడ ట్రాఫిక్ సీఐ మోడెం సురేష్



**వేములవాడ / ప్రజాదివాస్ మార్చి 13** దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ క్షేత్రానికి వచ్చే భక్తుల పట్ల ఆటో డ్రైవర్లు మర్యాదపూర్వకమైన ప్రవర్తనతో ఉండాలని వేములవాడ పట్టణ ట్రాఫిక్ సీఐ మోడెం సురేష్ సూచించారు. శుక్రవారం నాడు తిప్పపూర్ బస్టాండ్ వద్ద గల ఆటో డ్రైవర్స్ యూనియన్ పాయింట్ వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లందరూ తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, మోటారు వాహన చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ మరియు ఫిట్నెస్ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి డ్రైవర్ అప్రమత్తంగా ఉంటూ, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కోరారు. అనంతరం భక్తుల యెడల క్రమశిక్షణతో, గౌరవంగా వ్యవహరిస్తామని సుమారు 200 మంది ఆటో డ్రైవర్ల చేత ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ సముద్రాల రాజు, ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ మరియు అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.


# శాత్రాజ్ పల్లి ఇందిరానగర్ అంగన్వాడి స్కూల్లో అక్షరాభ్యాసం పాల్గొన్న కౌన్సిలర్ గుడిసె సంతోష కరుణాకర్




**వేములవాడ/ ప్రజాదీవాస్ మార్చి 13** వేములవాడ మున్సిపల్ పరిధిలోని మూడవ వార్డు శాత్రాజ్ పల్లి ఇందిరానగర్ అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సీడీపీఓ సౌందర్య మరియు సూపర్వైజర్ అంజమ్మ ఆదేశాల మేరకు చిన్నారులకు శుక్రవారం అక్షరాభ్యాసశీ కార్యక్రమం నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మూడో వార్డు కౌన్సిలర్ గుడిసె సంతోష కరుణాకర్ ను అంగన్వాడి టీచర్ గుడిసె పద్మ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ గుడిసె పద్మ, ఆశా వర్కర్లు ఎడవల్లి వజ్ర, కన్నం వసంత అంగన్వాడి పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సర్పంచ్ రెడ్డవేణి పర్శరాములు ఆధ్వర్యంలో సంకెపల్లిలో గ్రామ సమాఖ్య భవనానికి భూమి పూజ

**-మహిళా సంఘాల అభివృద్ధికి సర్పంచ్ పెద్దపీట:**
**సంకేపల్లిలో ఘనంగా భవన నిర్మాణ పనుల ప్రారంభం**
**-సర్పంచ్ చొరవతో మహిళా సంఘాలకు సొంత భవనం..**
**సంకెపల్లిలో పనులను ప్రారంభించిన రెడ్డవేణి పర్శరాములు**

**వేములవాడ మండలం/ప్రజాదివస్ మార్చి 13** వేములవాడ అర్బన్ మండలం సంకెపల్లి గ్రామంలో మహిళా సంఘాల కోసం నిర్మించనున్న వెంకటేశ్వర గ్రామ సమాఖ్య భవన నిర్మాణ పనులు ఘనంగా ప్రారంభమయ్యాయి. నేడు నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డవేణి పర్శరాములు ముఖ్య అతిథిగా పాల్గొని, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో మహిళా సంఘాల కార్యకలాపాలు మరింత మెరుగ్గా సాగడానికి, సభ్యులందరూ ఒకచోట సమావేశమై చర్చించుకోవడానికి ఈ భవనం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. మహిళా సాధికారతకు ఇలాంటి భవనాలు వేదికగా నిలుస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో, గ్రామ కార్యదర్శి, మహిళా సంఘాల సీసీ వనజ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు. అలాగే గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు రమ్య జ్యోతితో పాటు అన్ని మహిళా సంఘాల అధ్యక్షులు, సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. తమ కోసం ప్రత్యేకంగా భవనాన్ని నిర్మిస్తుండటం పట్ల గ్రామ మహిళా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# 5 లక్షల ఎల్ వో సి మంజూరు చేయించిన శాసన సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ముస్తాబాద్/ మార్చ్ 13 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ పట్టణానికి చెందిన గుండెల్లి శ్రీనివాస్ గౌడ్ తండ్రి దేవయ్య అను అతడు అనారోగ్య సమస్యల వలన ఉస్మానియా హాస్పిటల్ లో చేరడంతో వెంటనే సిరిసిల్ల నియోజవర్గం ఇంచార్జ్ కె.కె మహేందర్ రెడ్డి తెలియజేయగానే తక్షణమే వారు స్పందించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడి ఉస్మానియా ఆసుపత్రిలోని వైద్య సిబ్బందితో చర్చలు జరిపి ప్రత్యేకమైన చికిత్స అందించవలసిందిగా ఆదేశిస్తూ మరియు ప్రభుత్వం నుండి 5 లక్షల రూపాయలు ఆర్థిక సహాయంగా వెంటనే వైద్య ఖర్చులకు డబ్బులను మంజూరు చేశారు ఎల్ఓసి ఈరోజు గుండెల్లి శ్రీనివాస్ గౌడ్ కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. తొందరగా స్పందించిన ఎల్ ఓ సి మంజూరు చేపించడం పట్ల బాధిత కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ వేములవాడ శాసనసభ్యులుడ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మరియు సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కె.కె మహేందర్ రెడ్డి మరియు ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి ప్రత్యేకమైన ధన్యవాదములు తెలిపారు.

# 16న బడ్జెట్ లో బీసీల వాటాగా రూ 50 వేల కోట్లు కేటాయించాల్సిందే!

**బీసీ సబ్ ప్లాన్ చట్టబద్ధంగా అమలు చేయాల్సిందే!!**
**కేంద్రం చేపట్టే జనగననలో కులగనన చేపట్టాలని, కేంద్రంలో పెండింగ్ బీసీ బిల్లులపై అసెంబ్లీలో చర్చించాలి!**
**బీసీలపై జరుగుచున్న దాడులు, అత్యలు, అత్యాచారాలపై అసెంబ్లీలో చర్చించి బీసీ రక్షణ చట్టాన్ని తేవాలి!**
**"రాజీవ్ యువ వికాసం"కు రైతుభరోసా కు, విధ్యార్థుల ఫీజులు, స్కాలర్షిప్ బకాయిలతో పాటు బీసీ కార్పొరేషన్ కు నిధులు కేటాయించాలి!**
**పొలాస నరేందర్ ఇంచార్జీ ఉత్తర తెలంగాణ బీసీ సాధికారిత సంఘం**



**వేములవాడ/ ప్రజా దివాస్ మార్చి 13** ఈ నెల 16 నుండి రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగనున్న నేధ్యంలో బీసీలకు ఇచ్చిన హామీ మేరకు,బీసీ జనాభా దామాషాన బడ్జెట్లో కనీసం రూ!!50 వేల కోట్ల నిధులు కేటాయించాలని,చేసిన వాగ్దానం మేరకు చట్టబద్ధంగా బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని,ప్రతి ఏడు బీసీ సంక్షేమానికి రూ!!20,000 కోట్ల నిధుల చొప్పున 5 ఏండ్లకు రూ !! లక్ష కోట్ల నిధులు కేటాయిస్తామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ద్వార అధికారం లోకి రావడం జరిగిందని పొలాస నరేందర్ ఉత్తర తెలంగాణ బీసీ సాధికారిత సంఘం ఇంచార్జీ అన్నారు.కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేపట్టుచున్న జనగణన కార్యక్రమంలో భాగంగా బీసీ కులగణన కార్యక్రమము కూడ చేపట్టాలని,గత ఏడాది నుండి కేంద్రంలో పెండింగ్లో నున్న బీసీ రిజర్వేషన్ కు సంబంధించిన బిల్ నెంబర్ 3,బిల్ నెంబర్ 4 పెండింగ్లో ఉన్నందున వీటి గురించి అసెంబ్లీలో చర్చించాలని నరేందర్ అన్నారు.అలాగే బీసీలపై రోజురోజుకు జరుగుచున్న దాడులు,హత్యలు,హత్యాచారాల నేపథ్యంలో అసెంబ్లీలో ఏకగ్రీవంగా బీసీ రక్షణ చట్టాన్ని తీసుకురావాలని ప్రభుత్వాన్ని నరేందర్ డిమాండ్ చేశారు.మూలకు పడిన"రాజీవ్ వివ వికాసం"పథకానికి నిధులు కేటాయించి ముందుకు నడిపించాలని,నిరుద్యోగ యువతకు ఆర్థిక సహాయం అందిస్తామని గత ఏడాది మార్చి 15 నుండి ఏప్రిల్ 14 వరకు దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని నరేందర్ అన్నారు.అలాగే రైతులకు పెట్టుబడి సాయం క్రింద ఏర్పాటు చేసిన "రైతు భరోసా"డబ్బుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుచున్నందున రైతుల్లో ఎక్కువ శాతం వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ పేద రైతులు ఉన్నందున వారి ఇబ్బందులను అర్థం చేసుకొని తక్షణమే రతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమచేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్ బకాలను సైతం వెంటనే చెల్లించాలని,అలాగే బీసీ సంక్షేమం కై ఏర్పాటు చేసిన బీసీ కార్పొరేషన్ కు తగిన నిధులను ఈ బడ్జెట్లో కేటాయించాలని నరేందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

**-పోషకాహారం అందించాలి**
**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- సిరిసిల్ల అశోక్ నగర్ లోని అంగన్వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ**

**రాజన్న సిరిసిల్ల, మార్చి -13 ప్రజా దివాస్**
అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల పట్టణం అశోక్ నగర్ లోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లల హాజరు రిజిస్టర్ తనిఖీ చేసి, మొత్తం ఎందరు పిల్లలు ఉన్నారు? రోజూ ఎందరు వస్తున్నారో ఆరా తీశారు. పలువురు పిల్లల తల్లులతో మాట్లాడి.. గుడ్డు, పోషకాహారం ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లల ఎత్తు, బరువు కొలిచిన వివరాలు, ఆన్లైన్ అలాగే రిజిస్టర్ నమోదు చేసిన వివరాలు పరిశీలించారు. కేంద్రంలో నిలువు ఉన్న గుడ్లు, బాలామృతం తనిఖీ చేశారు. పిల్లల ఎత్తు, బరువు కొలిచే యంత్రాల పనితీరు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాలకు పిల్లలు రోజూ వచ్చేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాల సేవలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.



# ఆన్‌లైన్ బెట్టింగ్ లకు అలవాటు పడి మోసాలకు పాల్పడిన నిందితుల అరెస్ట్.

**-ఫోన్‌పే, పేటీఎం ద్వారా రూ.18 లక్షలకు పైగా మోసం..**

**-దోచుకున్న డబ్బులతో ˹99 బెట్టింగ్ యాప్‌లో పెట్టుబడులు.**

**వివరాలు వెల్లడించిన వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్.**




**గంగాధర మండలం/ ప్రజాదివాస్ మార్చి 13** గంగాధర మండలం ఓద్యారం గ్రామానికి చెందిన సత్పది సాయితరుణ్ (27), స్వగ్రామంలోని వెంకటేశ్వర దేవాలయంలో పూజారిగా పని చేస్తూ ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. బెట్టింగ్‌లో భారీగా డబ్బులు కోల్పోవడంతో, మళ్లీ బెట్టింగ్ ఆడేందుకు సులభ మార్గంలో డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు.అందులో భాగంగా వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన చెన్నమాధవుని రామరాజు (రిటైర్డ్ వీజూర) ప్రతిరోజు వాకింగ్ కోసం ఓద్యారం గ్రామానికి వచ్చేవాడు.ఈ పరిచయాన్ని ఉపయోగించుకున్న సాయితరుణ్, రామరాజుతో స్నేహం పెంచుకుని అతని దగ్గర డబ్బులు కాజేయాలనుకొని, ఒకరోజు రామరాజు ఇంటికి వెళ్లి,అతని మొబైల్‌లో ఫ్రాష్ట్రీఅవూవ, ఝఖ్ఎ అప్లికేషన్లు సరిగా పనిచేయడం లేదని చెప్పి కొత్త పిన్ నంబర్లు సెట్ చేస్తానని నమ్మబలికాడు.తనకు గుర్తుండేలా పిన్ నంబర్లు మార్చడు.ఆతరువాత రామరాజు తిరుపతికి దర్శనానికి వెళ్లాలని చెప్పడంతో, దర్శన టికెట్లు మరియు ట్రైన్ టికెట్లు బుక్ చేస్తానని నమ్మించి అతని మొబైల్ తీసుకున్నాడు. అలా రామరాజుకు తెలియకుండా అతని ఫ్రాష్ట్రీఅవూవ, ఝఖ్ఎ ద్వారా విడతల వారీగా మొత్తం రూ.18,46,885/- ను ఇల్లంతకుంట మండలం నరసక్కపేట గ్రామానికి చెందిన ధామేర హరీష్ ఖాతాకు ట్రాన్ఫర్ చేశాడు.తర్వాత ఆ డబ్బులను హరీష్ ద్వారా ఎతీఅఎవి99 అనే బెట్టింగ్ యాప్‌లో సాయితరుణ్ ఐడీలకు ట్రాన్ఫర్ చేయించి బెట్టింగ్ ఆడాడు.ఇందుకు ప్రతిగా హరీష్‌కు కమిషన్ రూపంలో దాదాపు రూ.1 లక్ష ఇచ్చాడు. అయితే ఆ మొత్తం డబ్బు కూడా బెట్టింగ్‌లో పోయింది.రామరాజు టికెట్ల గురించి అడిగినప్పుడల్లా సాయితరుణ్ వివిధ కారణాలు చెబుతూ తప్పించుకుంటూ వచ్చాడు. చివరకు మోసపోయానని గ్రహించిన రామరాజు బోయినపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దీనిపై బోయినపల్లి ఎస్సై రమాకాంత్ కేసు నమోదు చేశారు.తదుపరి వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేపట్టారు, ఈ క్రమంలో నిందితుడు కొంతకాలం ఉత్తరప్రదేశ్‌లోని దేవాలయాలకు వెళ్లి అక్కడే ఉండి, తరువాత తిరిగి ఓద్యారం వచ్చి హరీష్‌ను ఫోన్ చేసి వెంకట్రావుపల్లి గ్రామంలోని రాజన్న హోటల్ వద్దకు రమ్మనగా సాంకేతికత ఆధారంగా వేములవాడ రూరల్ జ× శ్రీనివాస్ గారు సాయి తరుణ్, హరీష్ లను అరెస్ట్ చెసి వారి వద్ద నుండి రెండు మొబైల్ ఫోన్లు , నగదు 80,000 నగదు స్వాధీన పర్చుకొని రిమాండ్ కి తరలించడం జరిగిందన్నారు.అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఫోన్‌పే, పేటీఎం వంటి డిజిటల్ లావాదేవీలకు సంబంధించిన పిన్ నంబర్లు, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. ఎలాంటి అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# ప్రజలకు సరిపడా గ్యాస్ సిలిండర్లు

**-పౌర సరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**-ప్రాజెక్ట్ లలో నీటి నిలువ, పంటల సాగు, యాసంగి పంటల కొనుగోలుకు ఏర్పాట్లపై మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, సీఎస్ రామకృష్ణారావుతో కలిసి సమీక్ష**

**- హాజరైన కలెక్టర్ గరిమ అగ్రవాల్**






**రాజన్న సిరిసిల్ల, మార్చి -- 13 ప్రజా దివాస్** రాష్ట్రంలో ప్రజలకు సరిపడా గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని పౌర సరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గ్యాస్ సిలిండర్లు, నీటి పారుదల ప్రాజెక్టులలో నీటి నిలువ, యాసంగి పంటల కొనుగోలకు ఏర్పాట్లపై శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, తదితర అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో పౌర సరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా పౌర సరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో డొమెస్టిక్ సిలిండర్లకు కొరత లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ళు, ఆసుపత్రులు, అనాథ ఆశ్రమాలు సిలిండర్లకు కొరత లేకుండా చూడాలని సూచించారు. ఈ మేరకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సిలిండర్లు పక్కదారి పట్టకుండా నిఘా పెట్టాలని తెలిపారు. జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని తెలిపారు. నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు.లష్కర్ నుంచి ఉన్నత స్థాయి అధికారి వరకు అందు బాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు. ప్రాజెక్ట్ లలో నీటి నిలువలు పరిశీలిస్తూ నీటిని విడుదల చేయాలని సూచించారు. పంటలకు సాగు నీరు అందించాలని తెలిపారు. యాసంగి సీజన్ పంటల కొనుగోలుకు ఏరారాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతులను ఆయిల్ పామ్ సాగు వైపు ప్రోత్సహించాలని సూచించారు. ఉద్యానవన శాఖ పంటల సాగుతో లాభాలపై వివరించాలని పేర్కొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాల శాఖ అధికారి రాధా భాయ్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, నీటి పారుదల శాఖ అధికారి కిశోర్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారి శరత్, నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 25వ వార్డులో ఏళ్లనాటి వాటర్ ప్లాంట్ కష్టాలకు మోక్షం

**వార్డులో మున్సిపల్ ఛైర్మన్ పర్యటన: అంగన్‌వాడీ కేంద్రం, వాటర్ ప్లాంట్ పునరుద్ధరణపై ఆరా**

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో వార్డుల అభివృద్ధి: మున్సిపల్ ఛైర్మన్**



**వేములవాడ/ ప్రజాదీవాస్ మార్చి 13 (అనిల్ కుమార్ గ్యారే)** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా స్థానిక ప్రజాప్రతినిధులు వేగంగా స్పందిస్తున్నారు. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డులో గత కొన్ని సంవత్సరాలుగా మూతపడి ఉన్న వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించేందుకు మున్సిపల్ ఛైర్మన్ పుల్కం రాజు మరియు వార్డు కౌన్సిలర్ కొక్కుల బాలకృష్ణ నేడు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వార్డు కౌన్సిలర్ కొక్కుల బాలకృష్ణ ఈ వాటర్ ప్లాంట్ సమస్యను ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఏళ్ల తరబడి మూతపడటంతో స్థానిక ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఛైర్మన్ పుల్కం రాజు, నేడు స్వయంగా ప్లాంట్‌ను సందర్శించి సాంకేతిక లోపాలను పరిశీలించారు.ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ సహకారం మరియు సూచనల మేరకు వార్డులోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు. త్వరలోనే ఈ వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు పూర్తి చేయించి ప్రజల వినియోగంలోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వార్డులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా ఛైర్మన్ మరియు కౌన్సిలర్ పరిశీలించారు. కేంద్రంలో కల్పిస్తున్న వసతులు, పిల్లలకు అందుతున్న పౌష్టికాహారం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కౌన్సిలర్ విన్నపానికి వెంటనే స్పందించి వార్డులో పర్యటించిన ఛైర్మన్‌కు వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కుంగిన రోడ్డు.. నిలిచిన లారీ...

**బావుసాయిపేట వెంకట్రావుపేట మధ్య స్తంభించిన రాకపోకలు..**



**కొనరావుపేట మండలం /ప్రజా దివాస్ మార్చి 13** బావుసాయిపేట – వెంకట్రావుపేట మధ్య రోడ్డు కుంగి ఇరుక్కుపోయిన లారీని అధికారులు, నాయకులు సమన్వయంతో తొలగించారు. రేపు ఉదయం పదో తరగతి పరీక్షలు ఉన్న దృష్ట్యా, విద్యార్థులకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, కొండాపూర్ ఉప సర్పంచ్ రాజిరెడ్డి వెంటనే స్పందించారు...ఘటనా స్థలానికి చేరుకుని స్వయంగా పర్యవేక్షించి, లారీని బయటకు తీయించి రవాణా మార్గాన్ని పునరుద్ధరించారు. దీంతో విద్యార్థులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు...ప్రయాణికులు విద్యార్థులు వారికి కృతజ్ఞతలు తెలిపారు..

# రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు

**-34 కేంద్రాల్లో ఏర్పాట్లు**

**-పరీక్ష రాసే విద్యార్థులు అరగంట ముందే చేరుకోవాలి**

**-హాజరుకానున్న విద్యార్థుల సంఖ్య 7,317**



**రాజన్న సిరిసిల్ల, మార్చి 13: ప్రజా దివాస్** ఈ నెల 14వ తేదీ శనివారం నుంచి పదో తరగతి పరీక్షలు మొదలు కానున్నాయి. జిల్లాలోని 34 పరీక్షా కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. నిర్ణీత పరీక్ష సమయం తరువాత ఐదు నిమిషాలు వరకు విద్యార్థులను అనుమతిస్తారు.34 కేంద్రాల్లో పరీక్షలు..పదో తరగతి పరీక్షలకు మొత్తం 7317 మంది విద్యార్థులు హాజరుకానుండగా, బాలురు 3511, బాలికలు 3806 మంది పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రాల్లో డెస్క్ లు, తాగునీరు, టాయిలెట్స్, ట్యూబ్ లైట్స్ ఇతర సౌకర్యాలు కల్పించారు. జిల్లాలో 34 కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. కుసుమ రామయ్య జడ్పీ హైస్కూల్ (బాయ్స్) సిరిసిల్ల, జడ్పీ హైస్కూల్ వెంకంపేట సిరిసిల్ల, సిద్దార్థ ఇంగ్లిష్ మీడియం పత్తిపాక వీధి సిరిసిల్ల, జడ్పీ హైస్కూల్ అంబేద్కర్ నగర్ సిరిసిల్ల, జడ్పీ హైస్కూల్ (బాలికల) ఏ వింగ్ సిరిసిల్ల, జడ్పీ హైస్కూల్ (బాలికల) బీ వింగ్ సిరిసిల్ల, జడ్పీ హైస్కూల్ నెహ్రూనగర్, ప్రభుత్వ హైస్కూల్ సిరిసిల్ల, జడ్పీ హైస్కూల్ (వొకేషనల్) తంగళ్ళపల్లి, తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ సిరిసిల్ల, జడ్పీ హైస్కూల్ చందుర్తి, జడ్పీ హైస్కూల్ రుద్రంగి, జడ్పీ హైస్కూల్ (వొకేషనల్) ఇల్లంతకుంట, కేరళ మోడల్ స్కూల్ ఇల్లంతకుంట, జడ్పీ హైస్కూల్ గాలిపెల్లి, జడ్పీ హైస్కూల్ జిల్లెల, జడ్పీ హైస్కూల్ లింగన్నపేట్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేములవాడ, శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ వేములవాడ, గౌతం హైస్కూల్ వేములవాడ, జడ్పీ హైస్కూల్ (బాలికల) వేములవాడ, కిడ్స్ కాన్వెంట్ హైస్కూల్ వేములవాడ, హంసిని డిజి హైస్కూల్ వేములవాడ, జడ్పీ హైస్కూల్(బాయ్స్) గంభీరావుపేట్ (వొకేషనల్), జడ్పీ హైస్కూల్(బాలికల) గంభీరావుపేట్, జడ్పీ హైస్కూల్(బాయ్స్) ముస్తాబాద్, జడ్పీ హైస్కూల్(బాలికల) ముస్తాబాద్ (వొకేషనల్), జడ్పీ హైస్కూల్ ఎల్లారెడ్డిపేట ఏ వింగ్, జడ్పీ హైస్కూల్ ఎల్లారెడ్డిపేట బీ వింగ్, జడ్పీ హైస్కూల్ వీర్నపల్లి (వొకేషనల్), టీఎస్ మోడల్ స్కూల్ కోనరావుపేట, సిరిసిల్ల (వొకేషనల్), జడ్పీ హైస్కూల్ ధర్మారం, జడ్పీ హైస్కూల్ బోయినపల్లి(వొకేషనల్), జడ్పీ హైస్కూల్ విలాసాగర్ ల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు.144 సెక్షన్ అమలు..పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేయనున్నారు. అలాగే పరీక్ష కేంద్రాల సమీపంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ జిరాక్స్ దుకాణాలు మూసివేయాలని, పరీక్షా కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురావద్దని అధికారులు సూచించారు.

**పర్యవేక్షణకు బృందాలు..**

పరీక్షల పర్యవేక్షణకు వివిధ శాఖల అధికారులతో బృందాలు ఏర్పాటు చేశారు. చీఫ్ సూపరింటెండెంట్లు 34, డిపార్ట్ మెంటల్ అధికారులు 34, సిట్టింగ్ స్క్వాడ్ 34, ఫ్లయింగ్ స్క్వాడ్ రెండు టీంలు, అడిషనల్ డిపార్టుమెంటు ఆఫీసర్స్, స్టేట్ లెవెల్ అబ్జర్వర్స్, కస్టోడియన్ అధికారులను నియమించారు. ప్రశాంతంగా పరీక్షలు రాయాలిపదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఆల్ ది బెస్ట్. ఎలాంటి ఒత్తిడి లేకుండా.. ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. పరీక్షల మధ్య విరామ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్షా సమయనికంటే ముందే చేరుకోవాలి